ప్రజాశక్తి

గురువారం 31 అక్టోబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ధరావళి

- పెరిగిన టపాసుల ధరలు
- జిఎస్‌టి కారణమంటున్న వ్యాపారులు
- సామాన్యునికి భారంగా బాణసంచా

విశాఖలో ఓ బాణసంచా దుకాణం వద్ద సాగుతున్న అమ్మకాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బాణసంచా, టపాసుల ధరలు భారీగా పేలాయి. గత ఏడాదితో పోలిస్తే అన్ని ధరలూ 25 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగాయి. ఏది కొనుగోలు చేయాలన్నా రూ.100కు తక్కువ లేదు. ఎయు గ్రౌండ్స్, ఎంవిపి.కాలనీ, గాజువాక ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలకు వెళ్లిన వారు ధరలను చూపి చెమటలు పడుతున్నారు. మతాబుల నుంచి థౌజండ్ వాలా, చిచ్చు బుడ్లు.. ఇలా ఏది చూసినా ధరలు విపరీతంగా పెరిగినట్లు కొనుగోలు దారులు గగ్గోలు పెడుతున్నారు. రవాణా, పన్నులు, పర్మిట్లు, షాపులు ఏర్పాటు ఖర్చులు, కెమికల్స్ ధరలు పెరగటం వల్ల మతాబుల ధరలు పెంచక తప్పలేదని వ్యాపారులు అంటున్నారు. హోల్‌సేల్ వ్యాపారుల నుంచి అధిక ధరకు వీటిని కొనుగోలు చేసి జివిఎంసి, ఫైర్, పోలీస్, విద్యుత్ శాఖ వగైరా వాటి నుంచి అనుమతులు పొందడానికి గత ఏడాదితో పోలిస్తే ఈసారి అధికంగా ఖర్చులు పెరిగాయని అంటున్నారు. ఈ పరిస్థితులలో సామాన్య, మధ్యతరగతి ప్రజలు టపాసులు కొనుగోలు చేయగలరా ? వాటిని కాల్చగలరా ? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

విశాఖ నగరంతో పాటు జిల్లాలో ఏటా దీపావళి పండగను ఘనంగా జరుపుకుంటారు. బాణసంచా ఎప్పుడూ భారీగానే మిగతా 2లో..

బేఖాతరు

- నోటీసుకు స్పందించని అభిజిత్ ఫెర్రో టెక్
- అక్రమ లే ఆఫ్ ప్రకటించి రెండు వారాలు
- పరిష్కరించే ప్రయత్నం చేయని ప్రభుత్వం

కంపెనీ ప్రాంగణంలో ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ యాజమాన్యం విఎస్ఇజెడ్ అధికారుల నోటీసును లెక్కచేయడంలేదు. చట్ట విరుద్ధంగా లే ఆఫ్ ప్రకటించి వెయ్యి మంది కార్మికులను యాజమాన్యం వీధుల్లోకి నెట్టి రెండు వారాలు దాటింది. లే ఆఫ్ ఎత్తివేసి పరిశ్రమను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పిస్తున్నా ఎవరి మనసూ కరగడంలేదు. బిజెపి అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్, జనసేన యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ కార్మికులకు న్యాయంచేసే చొరవ ఈ రోజుకూ తీసుకోలేదు. తమకు న్యాయం చేయాలని కార్మికులు వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నారు. కార్మికులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, సరైన కారణం చూపకుండా లే ఆఫ్ విధించడం కార్మిక చట్టాలకు విరుద్ధమైనప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకొని పరిష్కరించే పని చేయడంలేదు. కలెక్టర్ విజయకృష్ణన్ అభిజిత్ లే ఆఫ్ సమస్య తన పరిధిలోనిది కాదని తప్పించుకుంటున్నారు. విఎస్ఇజెడ్ అధికారులు నోటీసు మిగతా 2లో..

తీర ప్రాంత పరిశీలన

వార్త 2లో..

పాలవలసలో గెడ్డ ఆక్రమణ

వార్త 3లో..

2న విశాఖకు చంద్రబాబు రాక

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

ధరావళి

పేలుతుంది. డబ్బులు లేకపోయినా.. అప్పు చేసైనా ప్రజలు పండగ జరుపుకుంటారు. ప్రజల్లో ఉన్న ఈ ఆసక్తి కారణంగా నగరంలో ఏటా కోట్ల రూపాయల మేర బాణసంచా వ్యాపారం సాగుతోంది. ఈ ఏడాది గరిష్ఠంగా రూ.10 కోట్ల మేర బాణసంచా వ్యాపారం జరగవచ్చని భావిస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో వ్యాపారులు భారీ స్థాయిలోనే బాణసంచా స్టాకు తీసుకువచ్చారు. సంప్రదాయంగా ప్రజలు వినియోగించే బాణసంచా మాత్రమే కాకుండా కొత్తకొత్త పద్ధతుల్లో తయారు చేసిన బాణసంచాను కూడా మార్కెట్‌లో అమ్ముతున్నారు.

ధరలు ఇలా..

ఇక ధరల విషయానికొస్తే.. ఎక్కువగా పిల్లలు ఇష్టపడే కాకర పువ్వొత్తులు బాక్స్ పెద్ద సైజు రూ.150, చిన్న సైజు రూ.80 ఉంది. అయితే మంచి కంపెనీకి చెందినవి రూ.300 ధర ఉన్నాయి. తాళ్ళ చిన్న పెట్టె రూ.40, పెద్దవి రూ.80, సీమ టపాసులు చిన్న బాక్స్ రూ.80 ధరలో ఉంది. భూ చక్రాలు గత ఏడాది రూ.70 ఉండగా ఇప్పుడు రూ.100 నుంచి రూ.120 మధ్య ఉన్నాయి. 5000 వాలా బాంబు దండ గతంలో రూ.1200 నుంచి రూ.1300 ఉండేది. ఇప్పుడు రూ.1500 నుంచి రూ.1800 పలుకుతోంది. 1000 వాలా మంచి క్వాలిటీ గతంలో రూ.రెండు వేలు ఉండేది. ఇప్పుడు అదే రూ.2500కు చేరింది. అందులో సాదా రకం రూ.1800 వరకు ఉంది. చిచ్చుబుడ్డిలు చిన్న సైజు రూ.10 ఉండగా గత ఏడాది కంటే 20 శాతం అధికమైంది. బాణసంచా ధరలు తీవ్రస్థాయిలో పెరగడానికి జిఎస్‌టి కూడా కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

దుకాణాల ఏర్పాటులో అవినీతి ?

నగరంలో, ముఖ్యంగా ఎయు గ్రౌండ్స్‌లో బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసిన వ్యాపారస్తుల నుంచి జివిఎంసి పాలకవర్గం పెద్దలు లక్షలాది రూపాయలు లంచాలుగా తీసుకున్నారని వ్యాపారులు బహిరంగంగానే చెబుతున్నారు. కొందరు వ్యాపారులు ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదులు కూడా చేశారు. దీపావళి స్టాల్స్ ఏర్పాటులో వివిధ విభాగాలకు చెందిన అధికారులకు మామూళ్లు ఉంటాయనేది బహిరంగ రహస్యం. అందుకోసం ఒక్కొక్క వ్యాపారి రూ.లక్షకు పైగా ఖర్చు చేయక తప్పదని సమాచారం. ఈ ఏడాది ఎయు గ్రౌండ్స్‌లో బాణసంచా స్టాల్స్ ఏర్పాటు చేయడం కోసం 536 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 10 తిరస్కరణకు గురికాగా 526 దుకాణాలకు అనుమతులు లభించాయి. ఎంవిపిలో 32 దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు అగ్నిమాపక అధికారి ఒకరు తెలిపారు. ఎయు గ్రౌండ్స్‌లోగానీ, ఎంవిపి, గాజువాక ప్రాంతాల్లోగానీ అనుమతులు పొందిన స్టాల్స్ సంఖ్య కంటే అధికంగా ఏర్పాటు కావడం గమనార్హం.

ఆనందపురం : ఆనందపురంలో 10 దీపావళి సామగ్రి దుకాణాలకు అనుమతులు దక్కాయి. బీసీ కల్లాలు రోడ్డు శుభశ్రీ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో 6 షాపులు, బోయపాలెంలో 4 షాపులు ఏర్పాటయ్యాయి. విపరీతమైన ధరలతో కొనుగోలుదారులు ఖంగుతింటున్నారు. అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేసి మందుగుండు సామగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ చింతా వాసు నాయుడు హెచ్చరించారు.

బేఖాతరు

పంపి చేతులు దులుపుకున్నారు తప్ప ముందుకు వెళ్లలేదు.

వాస్తవానికి లే ఆఫ్‌పై విఎస్‌ఇజెడ్ అధికారులు ఆలస్యంగా స్పందించారు. ఈ నెల 14 నుంచి కార్మికుల పోరాటం కొనసాగడంతో యాజమాన్యానికి కొద్ది రోజుల క్రితం నోటీసు జారీచేశారు. వారం రోజుల్లో సమాధానమివ్వాలని దానిలో పేర్కొన్నా యాజమాన్యం స్పందించలేదని సమాచారం. అకారణంగా లే ఆఫ్ ప్రకటించిన యాజమాన్యాన్ని ప్రాసిక్యూషన్ చేయాల్సివున్నా ప్రభుత్వం పరిశ్రమాధిపతుల పక్షాన నిలబడింది. పరిశ్రమను మూసేసిన యాజమాన్యం తప్పిదాలను సరిచేసే ప్రయత్నం చేయలేదు. స్థానిక ఎమ్మెల్యే కలుగజేసుకొని సమస్యను పరిష్కరిస్తారని ఆశించిన కార్మికులకు నిరాశే ఎదురైంది. కంపెనీలో పనిచేస్తున్న వెయ్యి మంది కార్మికుల్లో దాదాపు 700 మంది సెజ్‌లో భూములు కోల్పోయిన వారే ఉన్నారు. వారంతా ఇప్పుడు ఉపాధి కోసం పోరాడుతున్నారు. కనీస వేతనాలు అమలుచేయకపోయినా, కార్మికుల భద్రత పట్టించుకోకపోయినా, బోనస్ చెల్లించకపోయినా దినం తీరక అభిజిత్ కంపెనీలో పనిచేస్తున్న ఆ కార్మికుల పట్ల యాజమాన్యం కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ వైఖరి పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం అచ్యుతాపురానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌రాగా లే ఆఫ్‌ను ఎత్తివేసి కార్మికులకు యథాతథంగా పని కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము వినతిపత్రం సమర్పించారు. అక్రమ లే ఆఫ్ ప్రకటించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తీర ప్రాంత పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర సముద్ర తీర ప్రాంతాన్ని కలుషితం కాకుండా మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య జివిఎంసి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్‌కె.బీచ్ పరిసర ప్రాంతాలను జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీచ్‌లో కాలువలు, గెడ్డలు ద్వారా సముద్రంలోకి చేరే మురుగు నీరు ఒక కిలోమీటర్ వరకు పైపులైను ద్వారా చేరేలా చర్యలు చేపట్టాలని, తద్వారా సముద్ర తీర ప్రాంతం దుర్వాసన రాకుండా పరిశుభ్రంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాద్ రాజు, పర్యవేక్షక ఇంజినీరు కెవిఎన్.రవి పాల్గొన్నారు.

ప్రజలకు మేయర్, కమిషనర్ దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర ప్రజలు హరిత దీపావళిని, స్వచ్ఛ దీపావళిని శుభ దీపావళిగా రంగు రంగుల దీపాలతో ఆనందంగా జరుపుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ కోరారు. ప్రజలకు వారు బుధవారం ఓ ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

2న జిల్లాకు సిఎం చంద్రబాబు రాక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నవంబర్ 2న విశాఖ జిల్లాకు వస్తున్నారని, ఆ రోజు 100 రోజుల ప్రణాళిక, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులపై జిల్లా అధికారులతో నేరుగా సమీక్ష నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. అధికారులంతా ఆయా శాఖల పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, 100 రోజుల ప్రణాళికలో చోటు కల్పించిన అంశాలు, ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలని, అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం జిల్లాలోని అన్ని విభాగాల అధికారులతో కలెక్టర్ ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. ఒక్కో విభాగం తాలూకా నివేదికలను పరిశీలించారు. మార్పులు చేర్పులపై సూచనలు చేశారు. జిల్లా ప్రగతికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సంక్షిప్త రూపంలో నివేదికలను తయారు చేయాలని, ముఖ్యమంత్రి అడిగిన అంశాలకు సూక్ష్మంగా సమాధానం ఇచ్చేలా సంసిద్ధం కావాలని హితవు పలికారు. తమ శాఖల పరిధిలో రాష్ట్ర స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలు, అనుమతుల విషయంలో ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని చెప్పారు. అధికారులు ప్రతి అంశంపైనా స్పష్టతతో, పూర్తి అవగాహనతో ఉండాలని సూచించారు. ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని జిల్లా రెవెన్యూ అధికారికి చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ అధికారికంగా ఇంకా వెలువడాల్సి ఉందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, సిపిఒ శ్రీనివాసరావు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఎఒ ఈశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటి పని మనిషిపై దాడి పట్ల

హోం మంత్రి అనిత స్పందించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళల రక్షణ కోసం పటిష్టమైన చర్యలను అమలు చేయాల్సిన పోలీసులే గంగ అనే ఇంటి పని మనిషి పట్ల అమానుషంగా, చట్టవ్యతిరేకంగా ప్రవర్తించి, స్టేషన్‌లో కాలు విరగ్గొట్టిన ఘటన జరిగి నాలుగు రోజులు అవుతున్నా నేటికీ రాష్ట్ర ప్రభుత్వం, హోం మంత్రి అనిత స్పందించకపోవడం అన్యాయమని సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి పి.మణి ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో గంగ అనే మహిళ ఇళ్లల్లో పనిచేసుకుంటూ జీవిస్తోందని, ఆమెపై ఆ ఇంటి యజమాని ప్రియాంక నల్లపూసలు పోయాయని, వాటిని పనిమనిషి గంగ దొంగతనం చేసిందని ఈ నెల 26న ఎంవిపి క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు విచారణ పేరుతో గంగను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళి లాఠీతో కొట్టారన్నారు. దీంతో గంగ ఎడమకాలు విరిగిపోయిందన్నారు. గంగ పట్ల పోలీసులు ఎంత భయానకంగా వ్యవహరించారో మణి తెలియజేశారు. ఘటన మొత్తం వ్యవహారంపై సక్రమంగా విచారణ జరపకుండా అభాగ్యురాలిపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించారన్నారు. విశాఖపట్నంలో పోలీస్ రాజ్యం నడుస్తోందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై హోం శాఖ మంత్రి అనిత జోక్యం చేసుకొని పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని, వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. గంగకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. తప్పుడు కేసు పెట్టిన ఇంటి యజమానురాలు ప్రియాంకపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆక్సిజన్ టవర్స్‌లో వేధింపులకు గురవుతున్న ఇంటిపనివారల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ పోలీసులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు, ఇంటిపనివారల సంఘం నాయకులు కె.కుమారి, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, అధ్యక్షులు జె.ఆర్.నాయుడు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మణి

బాలల సంరక్షణ కేంద్రాలు లైసెన్సులు పొందాల్సిందే..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాలల సంరక్షణ కేంద్రాలు జువైనల్ జస్టిస్ చట్టం సెక్షన్ - 41 ప్రకారం విధిగా లైసెన్సులు పొందాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. బుధవారం ఎంవిపి.కాలనీలోగల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

టపాసులతో జాగ్రత్త

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టపాసులతో వినికిడి శక్తిని కోల్పోవద్దని కెజిహెచ్ విశ్రాంత ఇఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ బి.రామకృష్ణ కోరారు. బుధవారం ఉదయం ఎంవిపి.కాలనీలోని ఎస్‌విపి డిగ్రీ కళాశాలలో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన బాణసంచాపై అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అతిగా శబ్ద కాలుష్యానికి గురయితే వినికిడి శక్తిని కోల్పోతామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ పర్యావరణహితంగా దివ్వెల పండగ నిర్వహించుకోవాలని కోరారు. బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బాబ్జీ, సిఫా సంస్థ సిఇఒ డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం, వైస్ ప్రిన్సిపాల్ అప్పారావు, ఇంగ్లీష్ లెక్చరర్ రాణి ప్రియాంక పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఇంటిల్లి పాది ఇష్టంగా జరుపుకునే దీపావళి పర్వదినాన్ని ప్రమాద రహితంగా జరుపుకోవాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని కెజిహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ టి.మోహనరావు మీడియాకు తెలిపారు. దీపావళి బాణసంచా వెలిగించే సమయంలో తీసుకునే జాగ్రత్తలను ఆయన వివరించారు. పిల్లలను మతాబులు, బాంబులు వంటి పేలే స్వభావం ఉన్న దీపావళి మందు గుండు సామానుకు దూరంగా ఉంచాలని కోరారు.

In the Court of the VII Additional Junior Civil Judge, Kakinada
O.S. No. 220/2023
Between:
Gadepae Paul Sarodh ...Plaintiff
AND
Gadepae Mable Syamala Devi and Others ...Defendants

D-7: Yeeda Sucharitha, W/o. Sandeep, Christian, aged 50 years, Doctor, D.No. 49-54-12, Green Park Colony, Balayya Sastry Layout, Visakhapatnam.

D-8: Yeeda Supravina, W/o. Stehen, Christian, aged 48 years, Engineer, D.No. 49-54-12, Green Park Colony, Balayya Sastry Layout, Visakhapatnam.

పై నెంబరు దావాలో 7వ మరియు 8వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనకుండగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం దీ. 08-11-2024వ సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
బోయనపల్లి రాధాకృష్ణ
ఎ.అనిల్‌కుమార్ రాజా
అడ్వకేట్స్, కాకినాడ
సెల్: 9440323951

IN THE COURT OF HON'BLE PRE JUNIOR CIVIL JUDGE, KAKINADA.
O.S.NO.1214/2021
Between :
M/s RAK Ceramics India Pvt Ltd, ADB Road, IDA Peddapuram, SAMALKOT ......Plaintiff
And :
M/s Jayathi Enterprises, Pendurthi. .....Defendant

పై సంఖ్య OS No. 1214/2021 దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారాను, పోస్టల్ ద్వారాను, ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరై నిమిత్తం **తేది. 01-11-2024 సం॥రంకి** వాయిదా వేసినారు. కావున ఆరోజు **ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గానీ, మీ వకీలు ద్వారాగాని పై కోర్టువారు ఎదుట హాజరై మీఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
ఎం.జవహర్ ఆలీ,
అడ్వకేట్,
డో.నెం.25-6-11,
గంజావారి వీధి, కాకినాడ,
సెల్: 9848307906

అమ్మవారి భూమి అన్యాక్రాంతంపై ఫిర్యాదు

రాజ్యలక్ష్మి అమ్మవారి భూములపై ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ గ్రూపు సభ్యులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని అయినాడు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి దేవాలయ భూములను అన్యాక్రాంతం చేసిన వ్యక్తులే స్పందనలో పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన సర్పంచ్ అరం జ్యోతి గ్రూపు సభ్యులు బుధవారం పద్మనాభం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 5/2లో ఏడెకరాల 34 సెంట్లు భూమి అమ్మవారి పేరు మీద రికార్డుల్లో పూర్వం నుంచి ఉందని తెలిపారు. ఈ భూమికి శిస్తు చెల్లిస్తూ కొంతమంది రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ రైతులు గ్రామానికి చెందిన కొంతమంది పెద్దలతో కలిసి అధికారాన్ని అడ్డం పెట్టుకొని సాగులో ఉన్న రైతుల పేర్లతో 2015 జనవరి 2న అప్పటి తహశీల్దార్ సుమతీబాయ్‌తో ఆ భూములను మార్పించుకున్నారు. విషయం తెలుసుకున్న అప్పటి సర్పంచ్ గ్రూపునకు చెందిన పలువురు జిల్లా ఉన్నతాధికారులకు, మీడియాకు ఫిర్యాదు చేశారు. దీంతో 2017 ఆగస్టు 1వ తేదీన అదే తహశీల్దార్ రికార్డును యథావిధిగా కొనసాగించారు.

ప్రస్తుతం అమ్మవారి భూముల్లో రైతులతో రేకుల షెడ్లు వేయించి, సొంతం చేసుకొని అమ్మకాలు చేసుకుందామని ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు. ఇవి అమ్మవారి దేవాలయం భూములేనని హైకోర్టు కూడా తీర్పునిచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఆ రైతులు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి పట్టాలు కావాలని దరఖాస్తులు చేస్తున్నారని వివరించారు. దీనిపై ప్రస్తుతం తహశీల్దార్ ఆనందరావు స్పందిస్తూ రాజ్యలక్ష్మి అమ్మవారి భూమిలో ఎటువంటి కట్టడాలు ఉన్నా తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోరాడ పాపారావు, జనసేన మండల అధ్యక్షులు కురిమిన రామస్వామినాయుడు, మామిడి శివ, టి.అప్పలనాయుడు, 50 మంది రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు చోట్ల

33 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- కె.కోటపాడు : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకొని అరెస్టు చేశామని ఏ కోడూరు ఎస్ఐ. డి లక్ష్మీనారాయణ అన్నారు.. కేరళకు గంజాయిని తరలిస్తున్న మహమ్మద్, ఫాన్. జిన్సన్‌లను మండలంలోని ఆనందపురం గ్రామంలో బుధవారం అదుపులో తీసుకొని, వారి వద్ద నుంచి 30. కిలోల గంజాయితోపాటు. ఒక కారు. మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించమన్నారు.

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండల కేంద్రం సమీపంలోని శీరాంపురం జంక్షన్ వద్ద బుధవారం మూడు కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా స్కూటీపై మూడు కేజీల గంజాయిని తరలిస్తున్న కొయ్యూరుకు చెందిన కోన సంతోష్, కుప్పు తేజలను అరెస్ట్ చేసి, గంజాయిని సీజ్ చేశామని తెలిపారు. నిందితులను రిమాండ్ కోసం చోడవరం తరలించినట్లు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. గంజాయి తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవగాహన కల్పిస్తున్న కెనరాబ్యాంక్ మేనేజర్ శరత్‌చంద్ర

అవినీతిని ఎదుర్కోవడంపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : కెనరా బ్యాంకు ఆనందపురం శాఖ ఆధ్వర్యాన ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాగరుకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవినీతి -ఎదుర్కోవలసిన విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ దాసరి శరత్‌చంద్ర మాట్లాడుతూ, విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్‌కె.పట్నాయక్, ఇతర పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపిలోనే ఉంటా : కార్పొరేటర్ సునీత

ప్రజాశక్తి - ఆరిలోవ : తాము ఎప్పటికీ వైసిపిలోనే కొనసాగుతామని జివిఎంసి 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత దంపతులు పునరుద్ఘాటించారు. వార్డు వైసిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం ఒక పత్రికలో టిడిపి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఫొటోతో వచ్చిన యాడ్‌కు తమకు సంబంధం లేదని ఖండించారు. ఈ యాడ్‌తో నేను టిడిపిలో చేరినట్లు తప్పుడు సంకేతాలు వెళ్లనున్న నేపథ్యంలో ఈ పత్రికా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కొంతమంది వైసిపి నాయకుల ప్రవర్తన వల్ల గత నాలుగు నెలలుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న మాట వాస్తవమేగాని అధికారికంగా ఏ పార్టీలోకి వెళ్లలేదని చెప్పారు. పార్టీ మారామని వస్తున్న ఆరోపణలు నమ్మవద్దన్నారు. వైఎస్.జగన్మోహనరెడ్డి, విజయసాయిరెడ్డి, ఎయు మాజీ విసి ప్రసాదరెడ్డిల ఆశీస్సులతోనే తాము పార్టీలో ఈ స్థాయిలో ఉన్నామని తెలిపారు. ఏ పార్టీలోకీ మారే ఉద్దేశం లేదని ఖరాఖండిగా చెప్పారు. రానున్న రోజుల్లో పార్టీ క్రియాశీలక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వైసిపి బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కెల్ల సునీత

విధుల నుంచి వర్క్ ఇన్‌స్పెక్టర్ తొలగింపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గృహనిర్మాణ సంస్థకు సంబంధించి మండల పరిధిలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ధనుంజయను ఐదు నెలల క్రితమే విధుల నుంచి తొలగించినట్లు హౌసింగ్ మండల ఎఇ ఎం.హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతనిపై పలు ఆరోపణలు రావడంతో విచారించిన మీదట సంస్థ ఉన్నతాధికారులు అతన్ని విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు.

విమ్స్ ఆసుపత్రికి రక్షణగా పోలీసులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విమ్స్ ఆసుపత్రికి రక్షణగా పోలీసు సిబ్బందిని కేటాయించారు. నగర పోలీసు కమీషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి రక్షణగా పోలీసులను నియమించారు. ఇటీవల విమ్స్ ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ గార్డులపై దాడులు జరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఘనంగా అనంతపద్మనాభస్వామి శాంతి కల్యాణం

ప్రజాశక్తి -పద్మనాభం : అనంత పద్మనాభ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న కుంతీ మాధవస్వామి ఆలయంలో మూడు రోజులుగా పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం స్వామివారికి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, అగ్ని హోమం, ప్రదక్షిణ కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో వివిఎంఆర్‌డిఎ మాజీ ఛైర్మన్ అక్కరమాని విజయనిర్మల దంపతులు, స్థానిక ఎంపిపి కె.రాంబాబు, కృష్ణాపురం ఎంపిటిసి సభ్యులు కె.లక్ష్మి, ఎర్రినాయుడు దంపతులు పద్మనాభం సర్పంచ్ టి.పాప దంపతులు, మాజీ సర్పంచ్ ఆర్ సన్యాసిరావు దంపతులు పాల్గొన్నారు.

బాణసంచా సామగ్రి అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : టీచర్స్ హెల్ప్ గ్రూప్ ఆధ్వర్యాన దీపావళి సందర్భంగా చిన్నారులకు రూ.20 వేలు విలువైన బాణా సంచా సామగ్రిని సంస్థ ప్రతినిధులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు కె.ముత్యాలరావు, అధ్యక్షులు మరగడ రామకృష్ణ, సభ్యులు కె.వెంకటరెడ్డి, కె.సూరిబాబు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్ సీనియారిటీని విడుదల చేయాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - ఆరిలోవ : మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్ సీనియారిటీ జాబితాను విడుదల చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్‌కు ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. యుటిఎఫ్ పోరాట ఫలితంగా ప్రభుత్వం ఈ నెల 26న మున్సిపల్ ఉపాధ్యాయులకు గ్రేడ్ 2 హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు షెడ్యూలు జారీచేశారు. ఈ నెల 28వ తేదీ నాటికి సీనియారిటీ జాబితా విడుదల చేసి, అభ్యంతరాలు స్వీకరణకు తుది గడువుగా నవంబరు 1న పేర్కొన్నారని, అయినా ఇప్పటి వరకు జాబితా విడుదల చేయలేదని తెలిపారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్, కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్, సీనియర్ నాయకులు బి.జనార్దన్, చినగదిలి మండల ప్రధాన కార్యదర్శి పద్మావతి, గౌరవాధ్యక్షులు ఎన్.ప్రసాద్, శేఖర్, నీలాద్రి తదితరులు ఉన్నారు.

ఘనంగా రవితేజ జన్మదినం

కేక్ కట్ చేస్తున్న గంటా రవితేజ

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ జన్మదిన వేడుకలు బుధవారం 6వ వార్డులో ఘనంగా నిర్వహించారు. కెవిఆర్ కేటరింగ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కేక్‌ను రవితేజ కట్‌చేశారు. ఈ సందర్భంగా కెవిఆర్ కేటరింగ్ అధినేత, విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన 500 మంది అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. గంటా రవితేజ ద్వారా 200 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు దాసరి శ్రీనివాసరావు, వార్డు బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, వాండ్రాసి అప్పలనాయుడు, పెంటకోట బబ్బేలు, కుప్పక రామకృష్ణ, కొల్లి బాబ్జి, కొరగంజి సూరిబాబు అబ్దుల్ భాష, రెడ్డి వెంకటరమణ, పోతిన రవణ, పిల్లా రమేష్, పోతిన నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయంలో గంటా రవితేజ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు టిడిపి అధ్యక్షులు పాసి నరసింగరావు, త్రినాథ్ కుమార్, కొప్పల రమేష్, కొప్పల కృష్ణ, గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలవలసలో గెడ్డ ఆక్రమణ

జెసిబితో చదును చేస్తున్న గెడ్డ స్థలం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ పరిధిలో ఉన్న గెడ్డను ఆక్రమించి మంగళవారం చదును చేస్తున్నారు. సర్వేనెంబర్ 39/4 లో ఎగువ పాలవలస నుంచి దిగువ పాలవలసకు వెళ్లే వర్షపు నీరు గెడ్డ సుమారు 10 అడుగుల లోతు, 12 అడుగులు వెడల్పుతో ఉంది. ఈ గెడ్డను మంగళవారం కొంతమంది జెసిబితో చదును సేసి పనులు చేపడుతున్నారు. గెడ్డను ఆక్రమించి ఆ స్థానంలో పైప్ లైన్లు వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వర్షపు నీరు పోవడానికి ఉండే గెడ్డను చదును చేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గెడ్డలు ఆక్రమణకు పాల్పడితే భవిష్యత్తులో వర్షపు నీరు పోవడానికి వీలు లేకుండా ఉంటుందని, రెవెన్యూ అధికారులు పరిశీలించి ఆక్రమణ కాకుండా చూడాలని పాలవలస గ్రామస్తులు కోరుతున్నారు.

విశాఖ డెయిరీ ఆక్రమించిన స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

విశాఖ డెయిరీ కబ్జా స్థలం పరిశీలన

ప్రజాశక్తి- గాజువాక : అక్కిరెడ్డిపాలెం సర్వే నెంబర్ 47/3లో విశాఖ డెయిరీ యాజమాన్యం సుమారు మూడెకరాల స్థలం కబ్జా చేసిందని సిపిఎం నాయకులు ఎ.లోకేశ్వరరావు స్పందనలో చేసిన ఫిర్యాదు మేరకు ఆ స్థలాన్ని గాజువాక తహసీల్దార్ కార్యాలయం సర్వేయర్ రామారావు, ఆర్ఐ మహేష్, విఆర్ఒ ఆనంద్ బుధవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో సిపిఎం నాయకులు ఎం.రాంబాబు, ఎ.లోకేశ్వరరావు, దాసరి అప్పారావు, సుబ్బన్న అప్పలరాజు ఉన్నారు.

వంతెన నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి డెయిరీకాలనీలో శిథిలావస్థకు చేరుకున్న ప్రధాన వంతెన ప్రాంతంలో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులను కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాన వంతెన శిథిలావస్థకు చేరుకుందని కాలనీ అసోసియేషన్ సభ్యులు తన దృష్టికి తీసుకురావడంతో సుమారు రూ.40 లక్షలు మంజూరుచేయించి పనులు చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్కు సూచించారు. కాలనీ పెద్దలు సతీష్, విశ్వనాధం, గోపి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్టిఎల్ ఉద్యోగులు

ఎన్ఎస్టిఎల్ 'రన్ ఫర్ యూనిటీ'

ప్రజాశక్తి -కరాస : సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ను పాటించేందుకు ఎన్ఎస్టిఎల్ "రన్ ఫర్ యూనిటీ"ని నిర్వహించింది. ముందుగా ఎన్ఎస్టిఎల్ శాస్త్రవేత్త, డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ రన్ను ఫ్లాగ్ ఆఫ్ చేశారు. ఎన్ఎస్టిఎల్ రెసిడెన్షియల్ క్యాంపస్లో జరిగిన రన్లో 200 మందికిపైగా ఉద్యోగులు పాల్గొన్నారు. రన్లో అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎన్ దాస్, శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది, జవాన్లు, ఎన్ఎస్టిఎల్ వర్క్స్ కమిటీ, సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొని రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు.

ఫ్రెషర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ మంజుల

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్డే వేడుకలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, జీవితంలో అత్యున్నత శిఖరాలను అందుకోవాలని విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలన్నారు. ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. జూనియర్ విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెందుర్తి : పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యాన జివిఎంసి జోన్ -8 కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రాజు మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్, నూనె, పనిముట్లు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న పిఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల పోస్టుల్లో వారసులకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు పెంటారావు, బాబూరావు, బాలు, జీవ, యేసు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు రాజు తదితరులు

దీపావళి - పర్యావరణంపై వక్తృత్వ పోటీలు

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కెవి.రమణ

ప్రజాశక్తి-మాధవధార : కంచరపాలెంలోని బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్రభుత్వ పాలిటెక్నిక్, కెమికల్ కళాశాల విద్యార్థులకు 'మన దీపావళి -మన పర్యావరణం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో వాసు, ద్వితీయ స్థానంలో తన్వీర్, మూడో స్థానంలో సాయితనుశ్రీ నిలిచారు. వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అనంతరం ఇంటర్నేషనల్ టీచింగ్ ఎక్సలెంట్ - 2024 అవార్డు గ్రహీత, కళాశాల ప్రిన్సిపల్ కెవి.రమణను ఫౌండేషన్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఎన్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎల్.కృష్ణారావు, జన విజ్ఞాన వేదిక నాయకులు ఎం.సుజాత, బిటి.స్వామి, జివి.కృష్ణారావు మాస్టారు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై సిపిఐ నిరసన

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : కూటమి ప్రభుత్వం పెంచిన ట్రూ అప్ ఛార్జీలను వెంటనే విరమించుకోవాలని సిపిఐ నాయకులు ఆటోనగర్ విద్యుత్ సబ్స్టేషన్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కెంగువ అచ్యుతరావు మాట్లాడుతూ, అధికారంలోకొస్తే విద్యుత్ ఛార్జీలు నియంత్రిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపిస్తోందని విమర్శించారు. ఇప్పటికే నిత్యవసర ధరలు పెరుగుదలతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వారిపై విద్యుత్ భారం మోపడం సరికాదన్నారు. అనంతరం ఎఇ, ఎడికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పప్పు అప్పారావు, పల్లేటి పోలయ్య, గుడివాడ గురునాథరావు, పి.పోతన్న, కె.వనజాక్షి, కె.పద్మ, సోమేష్, చిన్నారావు, ఓంకార్, శేఖర్ పాల్గొన్నారు.

మధురవాడ : పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యాన మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ, ఒక పక్క ఉచిత గ్యాస్ అంటూ మరో పక్క రూ.6078 కోట్లు విద్యుత్ చార్జీలు భారం ప్రజలపై మోపడం అన్యాయం అన్నారు. అనంతరం విద్యుత్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్.డి.బేగం, ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, కె.అరుణకుమార్, ఎంఎస్.పాత్రుడు, కె.రాంమహేష్, బి.కేశవయ్య, ఎన్.త్రినాధ్, ఎం.బంగారయ్య, షేక్ కాశీషా, జి వేలంగిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : తూర్పునియోజకవర్గం సిపిఐ ఆధ్వర్యాన హెల్త్సిటీలోని రెయిన్బో ఆసుపత్రి నుంచి ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జెఇ రామచంద్రరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అత్తిలి విమల, ఎస్.కె.రెహ్మాన్, ఎ.దేవుడమ్మ, కె.లక్ష్మణరావు, కాసుబాబు, ఎ.రవి, అప్పలరాజు, పుష్పలత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నాయకులు చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇ బి.రవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.రాంబాబు, అల్లు బాబూరావు, ఎం.అప్పలరాజు, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రవీంద్రకు సమస్యలు వివరిస్తున్న మత్స్యకార నాయకులు

మత్స్యకార సమస్యలపై మంత్రి రవీంద్రకు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మత్స్యకార సమస్యలపై రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు జివిఎంసి నాలుగో వార్డుకు చెందిన పలువురు మత్స్యకార నాయకులు బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మంగమారిపేట, ఉప్పాడ తదితర 14 మత్స్య కార గ్రామాలకు సంబంధించి మినీ జెట్టీ నిర్మించాలని, ఫిష్ నెట్ మేకింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఫిష్ ల్యాండింగ్ సెంటర్, ఐస్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు మత్స్యకార నాయకులు గరికిన ఎల్లయ్య, సూరాడ నరసింగరావు తెలిపారు.

4న బాలగౌరమ్మ నిలుపుదల

ప్రజాశక్తి- మునగపాక: వచ్చేనెల 4న బాల గౌరమ్మ నిలుపుదల ఉత్సవాన్ని విజయవంతం చేయాలని స్థానిక గౌరీపరమేశ్వరుల ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు కోరారు. 4న సోమవారం సాయంత్రం కోలాటం, సాము గరిడి తదితర పలు సాంస్కృతిక కార్యక్రమాలతో బాల గౌరమ్మను పురవీధులలో ఊరేగించి, తర్వాత గౌరీ పరమేశ్వరుల ఆలయంలో నిలుపుదల చేస్తామన్నారు. కార్యక్రమంలోగ్రామ పెద్దలు, మూల సంఘాల రైతులు ,భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బైండోవర్ కేసులు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో ఒకే పార్టీకి చెందిన ఇరు గ్రూపులపై బైండోవర్ కేసు నమోదుచేసినట్లు పద్మనాభం సిఐ సిహెచ్.శ్రీధర్ బుధవారం తెలిపారు. మద్ది గ్రామంలో ఆదివారం నుంచి బంగారమ్మ ఉత్సవాలు ప్రారంభం నేపథ్యంలో తెలుగుదేశం మాజీ మండల అధ్యక్షులు కాళ్ల నగేష్ కుమార్, ప్రస్తుత తెలుగుదేశం మండల యూత్ అధ్యక్షులు కాళ్ల వెంకట సత్యనారాయణ గ్రూపు సభ్యులు గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడంలో వివాదం తలెత్తిందని, ఇరు గ్రూపుల సభ్యులు నడిరోడ్డుపై బీభత్సం సృష్టించారని పేర్కొన్నారు. దీంతో రెండు గ్రూపులపైనా బైండోవర్ కేసు పెట్టి పద్మనాభం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

సిర్లపాలెం విద్యార్థినులు

ప్రజాశక్తి- ఆనందపురం : రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీలకు సిర్లపాలెం విద్యార్థులు ఎంపికయ్యారు. విశాఖపట్నం ఆంధ్రయూనివర్సిటీ మెడికల్ కాలేజీ గ్రౌండ్లో జరిగిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో సిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రేగాని హర్షిణి 600 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం సాధించగా, రేగాని శృతిక 400 మీటర్ల పరుగులో మొదటి స్థానం, 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించారు. వీరు త్వరలో ఏలూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో ఉమ్మడి విశాఖపట్నం తరుపున పాల్గొంటారని పీడీ బుత్తల సత్యం తెలిపారు. విద్యార్థినులు హర్షిణి, శృతికలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద, సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

మల్లాకంబలో గుడిలోవ విద్యార్థులు

ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన్ విహార విద్యార్థులు మల్లాకంబ జిల్లాస్థాయి క్రీడ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్ రమేష్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జిఎఫ్ఐ) ఆధ్వర్యాన గుడిలోవలో జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీలలో మల్లాకంబ పోటీలలో 12 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు నవంబర్ 8, 9 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆర్గనైజింగ్ సెక్రెటరి వి.దేముడు, సెక్రెటరీ వి.శ్రీనివాసరావు, విజ్ఞాన విహార పాఠశాల ప్రధానాచార్యులు ఎం.రామకృష్ణ, ఎన్.వెంకటారావు అభినందించారు.

గుడిలోవ విద్యార్థులు

ధరాభారంపై ఐద్వా నిరసనలు

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే అదుపు చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా అందివ్వాలని, ఫ్యూచర్ ట్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధరల నరకాసురుని వధ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ ధరలను చూసి సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. ఉప్పులు, పప్పులు, చింతపండు, బియ్యం, ఉల్లిపాయలు, టమాటా, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ప్రజలకు వస్తున్న ఆదాయానికి, ధరలకూ పొంతన లేని పరిస్థితి నెలకొందన్నారు. రిజర్వ్ బ్యాంకు నిర్వహించిన సర్వేలో 93.3 శాతం మంది ప్రజలు ధరలపై అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. సుప్రీంకోర్టు కూడా ఆకలితో ఎవరూ చనిపోకూడదని, ఆకలి కారణంగా ఆత్మహత్యలు చేసుకోకూడదని చెప్పిందన్నారు. అయినప్పటికీ బిజెపి, టిడిపి ప్రభుత్వాలకు చలనం లేదని విమర్శించారు. ఆహార ధాన్యాల నిల్వలు ఎఫ్‌సిఐ గోడౌన్స్‌లో బాగా పెరుగుతున్నాయని, వాటిని రేషన్ డిపోల ద్వారా సరఫరా చేయాలని అన్నారు. కేరళలో ఇస్తున్నట్టుగా 14 రకాల నిత్యావసర సరుకులను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్.వరలక్ష్మి, కె.అనురాధ, బొట్టా ఈశ్వరమ్మ, బి.భారతి, డి.కొండమ్మ, సుజాత, వి.ప్రభావతి, ఎల్.కామేశ్వరి, గీతాంజలి, కె.కుమారి, కె.చంద్రకళ పాల్గొన్నారు. **అనకాపల్లి :** నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డిడి వర లక్ష్మి మాట్లాడుతూ నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిత్యవసర సరుకులు రేషన్ డిపో ద్వారా ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. మరోవక్క ప్రభుత్వం మద్యం పాలసీని తీసుకువచ్చి, విచ్చలవిడి అమ్మకాలకు తెరతీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం పాలసీని వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ సూపర్‌సిక్స్‌లో భాగంగా ఇచ్చిన హామీమేరకు గ్యాస్ కనెక్షనుదారులందరికీ ఉచిత సిలెండర్లు ఇవ్వాలని, ముందుగా లబ్ధిదారులు డబ్బులు చెల్లిస్తే, తర్వాత 48 గంటల్లో బ్యాంకు ఖాతాల్లో వేస్తామన్న నిబంధన తొలగించాలని కోరారు.కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి. మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆర్.లక్ష్మి, ఐద్వా నాయకులు జి .సుభాషిణి,ఆర్. లక్ష్మి, యు.లోవ, పి. వాణిశ్రీ పాల్గొన్నారు.

అనకాపల్లి ఆర్‌టిసి కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నాయకులు

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

గాజువాక : నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఐ గాజువాక నియోజకవర్గం సమితి ఆధ్వర్యంలో కొత్త గాజువాక మార్కెట్ వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో నిత్యవసర సరుకుల ధరలను కట్టడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పల్లెటి పోలయ్య, కెంగువ అచ్యుతరావు, ఎ.విష్ణు, పి.దుర్గారావు, కె.వనజాక్షి, పి.పద్మ, పప్పు అప్పారావు, ముత్యాలరావు, మురళి, శేఖర్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలు తగ్గించాలని బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీలను గుప్పించిన కూటమి ప్రభుత్వం, నాలుగు నెలలు కాకముందే విద్యుత్ ఛార్జీలను పెంచి వినియోగదారులపైన అదనపు ఆర్థిక భారాన్ని మోపడానికి సిద్ధపడిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, కార్యవర్గ సభ్యుడు గొల్లు గురు బాబు, మండల కార్యదర్శులు వెలుగుల అర్జున్‌రావు, మేకా భాస్కర్, లింగంపల్లి నాగేశ్వరరావు

చిన్న పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకం

ప్రజాశక్తి - యలమంచిలి : చిన్న కంపెనీల మనుగడ నానాటికీ ప్రశ్నార్థకంగా మారుతోందని వై హోం సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ వి.హెచ్ చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఫ్యాక్టరీ ఆవరణలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, చిన్న కంపెనీలు మాయమై అదాని లాంటి గ్రూపు కంపెనీలే మిగిలేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. దేశంలో పారిశ్రామిక విధానంలో ఉత్పత్తి, సరఫరా విధానం తిరోగమనంలో ఉందన్నారు. ఇది భవిష్యత్తులో పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు, మధుసూదన రావు, సెక్యూరిటీ చీఫ్ మేనేజర్ వెంకటరావు పాల్గొన్నారు.

పంచరాత్రుల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ప్రజాశక్తి - యలమంచిలి : గ్రామ ఇలవేల్పుగా విలసిల్లుతున్న తులసీనగర్ భూలోకమాంబ పంచరాత్రుల ఉత్సవాలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమకుమారి తెలిపారు. బుధవారం ఉత్సవ కమిటీతో కలిసి పంచరాత్రుల ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐదు రోజులు పాటు జరిగే కార్యక్రమాల్లో దీపాలంకరణ, కోలాటాలు, డాన్స్ అకాడమీ కళాకారులతో కూచిపూడి, భరత నాట్యం,డాన్స్ బేబీ డాన్స్,డ్యాన్స్ మస్తీ, రంగేళీ డాన్స్, బుర్రకథ కళావిన్యాసాలు ప్రదర్శనలుంటాయని ఉత్సవ కమిటీ తెలిపింది

రూ.46 లక్షలతో రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం

ప్రజాశక్తి-అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల పంచాయతీ గవరపేట వీధి, ప్రమీలా నగర్ డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులను రూ.46లక్షలతో చేపడుతున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ అభ్యర్థన మేరకు నిధులు మంజూరు చేశామన్నారు. గవరపేట వీధిలో రోడ్డు, డ్రైనేజీ పనులకు మండల పరిషత్ నిధులనుండి రూ.20 లక్షలు, అలాగే ప్రమీల నగర్లో ఉన్న డ్రైనేజ్ నిర్మాణానికి రూ.26 లక్షలను మంజూరు చేశామన్నారు. నాణ్యతా లోపాలు లేకుండా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు,ఎంపీటీసీలు చదరం నాగేశ్వరావు, పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, వైస్ సర్పంచ్ చదరం చిన్న, వైయస్సార్ సిపి నాయకులు విల్లూరి చంద్రశేఖర్, వడ్డాది అశోక్,మొగసాల వెంకట్ ,ఆర్డబ్ల్యూఎస్ ఎఇ బిందు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభ

గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిటిసి అప్పారావు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కె.పి.అగ్రహారం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనుల గుర్తింపునకు సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ దేవర అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడ్డి పెంపకాన్ని సైతం రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిఎ లక్ష్మి రావు, విఆర్‌పి కూరచ రమేష్, దేవర బుల్లినాయుడు,జి. రమణ, నూకరాజు, వార్డ్ సభ్యులు గంగరవు రమణఅప్పారావు, పంచాయతీ కార్యదర్శి ఆర్. రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసులకు ఘన సత్కారం

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సత్కరిస్తున్న ఎఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు ఎం.రాజశేఖర్ రాజు, వి.సోమలింగం, సిహెచ్. మల్లేశ్వరరావు, ఏఎస్ఐ మహమ్మద్ సిరాజుల్ హక్, హెడ్ కానిస్టేబుల్ ఎం.రామారావులకు ఎఎస్‌పి ఎల్ మోహనరావు ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ వీడ్కోలు, సన్మానాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో అంకితభావంతో సుదీర్ఘకాలం పాటు మంచి సేవలు అందించారన్నారు. ఒత్తిడితో కూడుకున్న ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంలో చేరడం అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమంలో సిఐలు లక్ష్మణమూర్తి, బాల సూర్యరావు, లక్ష్మి, గఫూర్, రమేష్, రామకృష్ణారావు, పోలీసుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దేశ ఐక్యతకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రీయ ఏక్తా దివస్ పరుగును అదనపు ఎస్‌పి మోహనరావు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అనకాపల్లి రింగురోడ్డు జంక్షన్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు పోలీసులు పరుగు నిర్వహించి, అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞను ఎఎస్‌పి చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని దేశ ఐక్యతను పెంపొందించడం, దేశానికి పటేల్ చేసిన కృషిపై అవగాహన కల్పించడం దీని లక్ష్యమన్నారు. ఎఆర్ డిఎస్‌పి పి.నాగేశ్వరరావు, సిఐలు టివి.విజయ్ కుమార్, ఎం.వెంకటనారాయణ, ఎల్.మన్మధరావు, సిహెచ్. సంజీవరావు, ఎస్సైలు వి.సత్యనారాయణ, డి.శేఖరం, డి.ఈశ్వరరావు, మహమ్మద్ అలీ షరీఫ్, ఎ.వెంకటేశ్వరరావు, ఎన్.సత్యనారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

అభిజిత్ కార్మికులకు న్యాయం చేయాలి

నోట్లో గడ్డి, ఆకులు పెట్టుకుని వినూత్న నిరసన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అభిజిత్ పరిశ్రమలో ఉపాధి కోల్పోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గడ్డి ఆకులు నోట్లో పెట్టుకుని కార్మికులు నిరసన చేపట్టారు. అక్రమంగా పరిశ్రమను మూసివేసి, కార్మికుల ఉపాధిని దెబ్బతీసిన పరిశ్రమ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ 17 రోజులుగా పరిశ్రమ మూతబడి, . వెయ్యి మంది కార్మికులు కుటుంబాలు రోడ్డున పడినా అధికారులు, యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులతో దీపావళి పండగ రోజున కూడా కార్మికులు అంధకారంలో గడపాల్సిన దుర్భర పరిస్థితులు కల్పించడం దారుణమన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలని లేబర్ అధికారులు, జిల్లా కలెక్టర్, ఎపిఐఐసి అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వాలు

వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్న అభిజిత్ కార్మికులు

ఉపాధి కోల్పోయిన కార్మికులకు న్యాయం చేయరా అని ప్రశ్నించారు. ఆడిగారు. నిబంధనలు తుంగలో తొక్కి పరిశ్రమను మూసేసిన అభిజిత్ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారుఆందోళన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము మండల కన్వీనర్ కె సోమనాయుడు, అభిజిత్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల చురుగ్గా టిడిపి సభ్యత్వ నమోదు

టిడిపి సభ్యత్వ నమోదులో పాల్గొన్న గండి బాబ్జి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీలో బుధవారం టిడిపి నేతల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదులో పెందుర్తి నియోజకవర్గ ఇంచార్జి గండి బాబ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో రానున్న అయిదేళ్లలో రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సభ్యత్వ నమోదుకు విశేష స్పందన ఉందన్నారు. గ్రామాలలో టిడిపి నేతలు, కార్యకర్తలు సమన్వయంతో సభ్యత్వంపై దృష్టి పెట్టి విజయవంతం చేయాలని కోరారు. మండల టిడిపి అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి వంశీ, ఉపసర్పంచ్ బలిరెడ్డి సూర్య ప్రసాద్, టిడిపి నేతలు రేసుపూడి రమణ, బలిరెడ్డి అప్పారావు, కర్రి బంగారునాయుడు, బోండా కళ్యాణ్, బలిరెడ్డి బంగారు నాయుడు, పెద్దాడ రమణమ్మ పాల్గొన్నారు

దేవరాపల్లి : మండల కేంద్రంలోని మహేశ్వరి థియేటర్ ఆవరణలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు గొర్లి దేవుళ్ళు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. పార్టీ సీనియర్ నాయకులు ఎల్లేటి కరుణాకరరావు, సత్యారాజ్, కోరుప్రోలు చంద్ర రావు, దుక్క సత్తిబాబు, కొండబాబు, బాబ్జి, మునూరు మహాలక్ష్మి, జాన దేముడమ్మా, రమణమ్మ, ఎర్రియమ్మా పాల్గొన్నారు.

ప్రేమ సమాజం చిన్నారులకు బాణసంచా

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని కొక్కిరాపల్లి ప్రేమసమాజం పిల్లలకు అనకాపల్లి వ్యాపారవేత్త దొడ్డి వెంకటసత్యనారాయణ (బాబు) దీపావళి పండుగ పురస్కరించుకొని బాణసంచా అందజేశారు. ఏటా దీపావళికి ప్రేమసమాజం పిల్లలకు మతాబులు అందిస్తున్నారని ఆశ్రమ నిర్వాహకులు స్వామి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో దొడ్డి మిత్రమండలి ఆల్లా ఇంద్రకుమార్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పివి జగన్‌మోహనరావు, మళ్ల బుజ్జి, కొణతాల గణేశ్, కాంగ్రెసుల సీతారాం బాబ్జీ, రాజు, వృద్ధులు పాల్గొన్నారు.

ఘనంగా రత్నకుమారి జన్మదిన వేడుకలు

రత్నకుమారికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగు మహిళ రాష్ట్రఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ వచ్చి రత్నకుమారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం విజయరామరాజు పేటలో అర్బన్ టిడిపి కార్యదర్శి, పోలారపు త్రినాద్ కుమార్తె రజస్వలవేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. భీమునిగుమ్మంలో ఇండియన్ నేవీలో ఉద్యోగవిరమణ చేసిన ముత్యాల నాగేశ్వరరావు దంపతులను సన్మానించారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -కశింకోట: రహదారి భద్రత నిబంధనలు, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని స్థానిక ఎస్ఐ లక్ష్మణరావు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన కశింకోట జాతీయ రహదారిపై భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ, మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాద నివారణ సాధ్యమవుతుందన్నారు. మితిమీరిన వేగం ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. (అనకాపల్లి ఏరియా కోఆర్డినేటర్ ధర్మారావు, ఎపిఎం నడిపూరి పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిసిలు ఉష, సన్యాసిరావు, నూకినాయుడు, నాగేశ్వరరావు, ఉమ మహేశ్వరి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు
రూ.1.15 కోట్ల నిధులు విడుదల

ప్రజాశక్తి-కె. కోటపాడు: మాడుగుల నియోజకవర్గంలో ఉన్న నాలుగు కస్తూరిబా బాలికల పాఠశాలలకు రూ.115.6 లక్షల నిధులు విడుదల చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. కే కోటపాడు, మాడుగుల, చీడికాడ, దేవరపల్లిలో ఉన్న కెజిబివి పాఠశాలల్లో కంప్యూటర్స్, లైబ్రరీ, ఆర్ట్ క్రాఫ్ట్ గదుల నిర్మాణాలకు ఈ నిధులు వెచ్చిస్తామన్నారు.

రోడ్డుపైనే వారపుసంతతో ట్రాఫిక్‌కు ఇక్కట్లు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండల కేంద్రంలో చెరకు కాటా వద్ద ప్రతి బుధవారం జరుగు వారపుసంత కశింకోట, బంగారుమెట్ట రోడ్డుపైనే జరుగుతుండడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, చేపలు మాంసం దుకాణాలు తినుబండారాలు తదితర దుకాణాలు నిర్వహిస్తున్నారు. సమీప గ్రామాలకు చెందిన కొనుగోలుదారులతో ఈ ప్రాంతమంతా రద్దీగా ఉంటుంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. బుధవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో పలు వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోయాయి రోడ్డుకు ఇరువైపులా కాకుండా, దూరంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని, ఈ మేరకు పోలీసులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పలుచోట్ల ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

సన్ ఇనిస్టిట్యూట్‌లో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనముగా నిర్వహించారు.కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ దీపావళి జ్యోతులను వెలిగించారు. డైట్ లిటరరీ అండ్ కల్చరల్ క్లబ్ కమిటీ నిర్వహించిన మండల ఆర్ట్స్, దియా పెయింటింగ్స్, వాల్ ఆర్ట్స్ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.కాలేజీ సిబ్బందికి దీపావళి ప్రమిదలు అందజేశారు.కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: అయ్యన్న విద్యాసంస్థలలో ముందస్తు దీపావళిని ఘనంగా నిర్వహించారు.అయ్యన్న స్కూల్, జూనియర్,డిగ్రీ కాలేజీల విద్యార్థుల సాంప్రదాయ దుస్తులు ధరించి నిర్వహించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం పాల్గొని దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గాయత్రి హైస్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు దీపావళి ప్రత్యేకతను వివరిస్తూ విద్యార్థులు నరకాసుర వధ నాటకాన్ని ప్రదర్శించారు.. వివిధ సాంప్రదాయ దుస్తులలో బాలబాలికలుఅలరించారు. విద్యార్థులందరూ టపాకాయలు కాల్చి దీపావళి సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్, హెచ్ఎం వై నగేష్ యాజమాన్య కమిటీ సభ్యులు ఐ.అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్ ఇనిస్టిట్యూషన్స్‌లో..

ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని సన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో బుధవారం సాయంత్రం పర్యావరణహిత దీపావళిని ఘనంగా నిర్వహించుకున్నారు. సాంస్కృతిక, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి భారతీయ సంప్రదాయాలను, దీపావళి విశిష్టతను తెలియజేశారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు, సిబ్బంది సంప్రదాయ దుస్తులతో ఈ కార్యక్రమానికి హాజరై సందడి చేశారు. అతిథులకు 21 రకాల మిఠాయిలను పంపిణీ చేశారు.

టిజెఎఫ్ ఆధ్వర్యాన..

తెలుగు జర్నలిస్టు ఫోరమ్ (టిజెఎఫ్) ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌కు సమీపంలోగల రాయల్ ప్యాలెస్‌లో ఘనంగా దీపావళి వేడుకలు జరిగాయి. జర్నలిస్టులకు బాణసంచా, హెల్మెట్, స్వీట్లు పంపిణీ చేశారు. అతిథులు సిటీ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, నిర్మాత, ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుతరావు మాట్లాడారు. టిజెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు పి. ఈశ్వర్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్ పాఠశాలలో దీపావళి వేడుకలు

గాజువాక : చట్టివానిపాలెంలోని భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో దీపావళి వేడుకలు బుధవారం నిర్వహించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు దీపావళి పండుగ విశేషాలను విద్యార్థులకు వివరించారు. సత్యభామ చేతులలో నరకాసుర వధ వృత్తాంతాన్ని వివరించి, చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ జరుపుకుంటారని తెలిపారు. వాయు, శబ్ద కాలుష్యం లేని దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు మట్టి ప్రమిదలకు రంగులు అద్ది అందంగా తయారు చేసే పోటీలను (దియా పెయింట్), డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఎస్.శిరీష, బి.సునీత, డి.రాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: రెవెన్యూ సదస్సులను రైతుల సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ ఎం లక్ష్మి కోరారు.. బుధవారం మండలంలోని అప్పన్నపాలెంలో రెవెన్యూగ్రామసభ నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేలో తలెత్తిన భూసమస్యలను అధికారుల దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నమ్మి అప్పలరాజు, ఎంపిటీసి కంచిపటి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్బవరం. : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ , సబ్బవరం రెవిన్యూ గ్రామంలో బుధవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. భూ రీసర్వే సమస్యల పై 78 అర్జీలు అందినట్లు స్థానిక తహసీల్దార్ బి. చిన్నికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి గణేష్, మండల సర్వేయర్ అప్పారావు, వి ఆర్వోలు, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, కోటన అప్పారావు, ఎంపిటిసి బైలపూడి దేముడు బాబు, పల్లా తాతారావు, కోరాడ శ్రీనివాసరావు, ఎం.అక్కుబాబు, పోతల కనకరాజు ,గొర్లె శ్రీనివాసరావు, టి శేఖర్ , బంతికోళ్ల పద్మ ,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు హరిపురం విద్యార్థులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు హరిపాలెం హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 29న హరిపాలెం హైస్కూల్లో జిల్లాస్థాయి త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అండర్-14 విభాగంలో హైస్కూల్ చెందిన భాగ్యరాజ్ ,జాహ్నవి, అండర్ 17 విభాగంలో సాయి అప్పారావు, యమునా, కళ్యాణి మంచి ప్రతిభను కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీపాద రవి, ఉపాధ్యాయుడు ధర్మారెడ్డి రాజు తెలిపారు.

అలాగే అండర్ -14 ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు భాను,తేజ ఎంపికయ్యారు. క్రీడాకారులను విద్యా కమిటీ చైర్మన్ తంగేటి సత్యనారాయణ, ఉపాధ్యాయులు కెఆర్ఆర్ కుమార్, ఎంజె పట్నాయక్ గాంధీ, బాషా, హైమావతి, అమ్మాజీ నూర్, నిషా రమణి, అనురాధ, సరస్వతి, గ్రామస్తులు అభినందించారు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు .

నిబంధనల మేరకు బాణసంచా అమ్మకాలు జరపాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని చోడవరం రోడ్‌లో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలను పరవాడ డిఎస్‌పి కె. వి.సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. దుకాణదారులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళి పండుగను జరుపుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. దుకాణాల మధ్య మూడు మీటర్లు దూరం ఉండాలని, నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు దుకాణాలకు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచినా,, అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సబ్బవరం మండలంలో లైసెన్స్ కలిగిన నాలుగు దుకాణాలను పరిశీలించి, అనుమతులిచ్చామనానరు. . డివిజన్‌లో అనుమతులు లేకుండా బాణసంచా అమ్ముతున్న వారిపై తొమ్మిది కేసులు నమోదు చేశామన్నారు. యలమంచిలి, మునగపాకల్లో చెరో రెండు కేసులు, పరవాడ లో ఒక కేసు నమోదయినట్లు తెలిపారు. రెండు లక్షల విలువైన బాణ సంచాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సబ్బవరం సిఐ పిన్నింటి రమణ, సిబ్బంది పాల్గొన్నారు

దుకాణదారులకు సూచనలు చేస్తున్న పరవాడ డిఎస్‌పి

అచ్యుతాపురం : దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా అమ్మకాలకు అనుమతులు పొందిన వ్యాపారులు తగు జాగ్రత్తలు పాటించాలని అచ్యుతాపురం సిఐ నమ్మి గణేష్ హెచ్చరించారు.దుకాణాల భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. బుధవారం దుకాణాలను తనిఖీ చేసి, ఏర్పాట్లు, చేపట్టిన జాగ్రత్తలను పరిశీలించారు. ఎటువంటి ప్రమాదకరమైన సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి- మునగపాక: విద్యాభివృద్ధి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయికృష్ణ అన్నారు. బుధవారం స్థానిక హైస్కూల్ ప్రహరీ నిర్మాణ పనులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాఠశాల ప్రహరీకి రూ.9లక్షలు మంజూరయ్యాయని, అందరి సమిష్టి నిర్ణయంతో పనులు చేస్తున్నామన్నారు. జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం , కూటమి నాయకులు దాడి శివ, బొడ్డేడ అప్పలనాయుడు, విల్లూరి నర్సింగరావు, దాడి భీమునాయుడు, ఆడారి లక్ష్మణరావు, సూరిశెట్టి అప్పల నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, భీలా లక్ష్మణరావు, కాశి పాల్గొన్నారు.

సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి కొత్తూరు కాలేజీ జంక్షన్‌లో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ బుధవారం ఫోరం ఫర్ సోషల్ రైట్స్ ప్రతినిధులు నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ కొత్తూరు జంక్షన్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని, వివిధ ప్రాంతాల నుండి అనకాపల్లికి విద్యా ఉద్యోగ వ్యాపార అవసరాల నిమిత్తం ప్రతి రోజు అనేకమంది వచ్చిపోతుంటారన్నారు. వారి అవసరాల కోసం ముఖ్యంగా మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునిసులబ్ కాంప్లెక్స్ నిర్మించాలన్నారు.. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు కొల్లి చిన్న అప్పారావు, సూదికొండ మాణిక్యాలరావు, చెవ్వేటి అప్పారావు, కట్టమూరి నూక అప్పారావు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి - పరవాడ: లంకెల పాలెం నుండి గల్లవానిపాలెం, శనివాడ, జాబిలి హిల్స్, సెక్టర్ 12, చైతన్య పబ్లిక్ స్కూలు, స్టీల్ ప్లాంట్ జనరల్ హాస్పిటల్ కలుపుతూ బస్సు సౌకర్యం కల్పించాలని జివిఎంసి 79 వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కోరారు. బుధవారం ఎపిఎస్ఆర్‌టిసి ప్రజారవాణాశాఖాధికారి బి అప్పలనాయుడును కలిసి.విన్నవించారు. దీనిపై డిపిటిఒ స్పందిస్తూ వారం రోజుల్లో దీనిపై చర్య తీసుకుంటామని హామీ శ్రీనివాస్ తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -అనకాపల్లి : 33/11కెవి విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా తుమ్మపాల సెక్షన్ కార్యాలయం వాటర్ వర్క్స్ సబ్‌స్టేషన్ పరిధిలో తుమ్మపాల, మార్టూరు గ్రామాల్లో 1న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎస్ రామకృష్ణ తెలిపారు.

ఉచితం పేరుతో ఇసుక అక్రమ రవాణా

ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

ప్రజాశక్తి -కోటవురట్ల: ఉచిత ఇసుక పేరుతో నదులను ఊదేస్తున్నారు. మండలంలో ప్రభుత్వ అభివృద్ధి పనులకు, గృహ నిర్మాణదారులకు ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుకను ఆశరాగా చేసుకుని అక్రమ మార్గాన దళారులు ఊదేస్తున్నారు. మంగళవారం తహసిల్దారు తిరుమలబాబు లాంఛనంగా మండలం నుండి ఒకే ఒక్క ట్రాక్టర్‌కు అనుమతితో ప్రారంభించారు. బుధవారం నుండి గొట్టువాడ వరాహనది ప్రాంతం నుండి సహజ వనరులు ఇసుకను పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా తరలించకపోతున్నారు, మండల అవసరాలకు మాత్రమే కాకుండా ఇతర మండలాల నుంచి వచ్చిన వాహనాలతో ఇసుకను తరలించుకుపోతూ ఉండడంతో గ్రామస్తులు సహా మండల వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గొట్టువాడ, కైలాసపట్నం, పందూరు, గ్రామాలలో ఇసుకను తరలించుకునేందుకు గుర్తించగా ఆయా ప్రాంతాలలో అనధికారికంగా ఇసుక తరలింపునకు వేలం పాటలు నిర్వహించుకుంటున్నారు. ఇందులో భాగంగా గొట్టువాడ గ్రామానికి రూ.5.20లక్షల వరకు వేలంపాట నిర్వహించారు. పందూరు గ్రామానికి రూ.18 లక్షల వరకు వేలంపాట నిర్వహించినట్లు సమాచారం. ఇక్కడి నుంచి తరలిస్తున్న ఇసుకను ట్రాక్టర్కు 5 వేల వరకు వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్‌తో ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లవచ్చునన్న ప్రభుత్వ ప్రకటనతో ఇసుకను తరలించుకు పోతూ ఉండడంతో నిర్దిష్టమైన ఆదేశాలు గాని వనరులను తీసుకువెళ్లేందుకు గుర్తించిన ప్రదేశాలు కానీ లేకపోవడం విశేషం. మైన్స్ అధికారులు పరిశీలించి వాల్టా చట్టానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా గుర్తించాల్సి ఉంది. ఆ మేరకు అధికారులు గుర్తించిన నిల్వలను మాత్రమే తరలించాల్సి ఉండగా యథేచ్ఛగా ఇసుకను తరలించకపోతున్నారు. వాగులు, వంకలలో ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లొచ్చునన్న ప్రభుత్వ ప్రకటనతో వాహనాలు అధికంగా రావడంతో బుధవారం సాయంత్రం సమయంలో రెవెన్యూ పోలీసు అధికారులు దాడులు నిర్వహించారు. తరలిస్తున్న వాహనాలను కట్టడి చేశారు. స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం ప్రకటించక పోవడంతో వాహనదారులు ఉచిత ఇసుకకై బారులు తీరుతున్నారు. ప్రభుత్వం అధికారులు ఇప్పటికైనా స్పష్టమైన ఆదేశాలు ప్రదేశాలు గుర్తించి ఉచిత ఇసుకను తరలించేందుకు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంత ప్రజలు, గృహ నిర్మాణదారులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న సునీల్ ఇమ్మానుయేల్

విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: విద్యార్థులు తమకు ఎదురయ్యే అడ్డంకుల పై కాకుండా లక్ష్యంపై దృష్టి పెట్టాలని ఐజి, డైరెక్టర్ నిషా, (హైదరాబాద్) కె.సునీల్ ఇమ్మానుయేల్ సూచించారు. బుధవారం ఆయన పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు వారి సౌఖ్య పరిధి దాటి బయటకు వచ్చి సవాళ్లను ఎదుర్కొనాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రణాళికలను రూపొందించి వాటిని అమలు చేసే లక్ష్యాలను నిర్ణయించుకోవాలన్నారు. ఎదురయ్యే అడ్డంకులపై కాకుండా లక్ష్యంపై దృష్టి సారించాలన్నారు. సమాజానికి మన వంతు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలలో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి శ్రీ సిహెచ్.విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎం వి వి ఎస్ మూర్తి, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. రామకృష్ణారెడ్డి, సీబీఎస్ఈ వైస్ ప్రిన్సిపల్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేతలతో మాట్లాడుతున్న అనిత

మత్స్యకార, నీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉద్దండపురం, దొండవాక గ్రామాల్లో మత్స్యకార సొసైటీ, నీటి సంఘాల ఎన్నికలపై ఆయా గ్రామాల నేతలతో హోం మంత్రి వంగలపూడి అనిత సమీక్షించారు. నక్కపల్లి లో ఆమె స్వగృహంలో బుధవారం రాత్రి పార్టీ శ్రేణులతో ఎన్నికలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కురందాసు నూకరాజు, గోసల చిన తాతారావు, పిక్కి కొర్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జనరల్ ఫండ్ వినియోగంపై వాగ్వాదం

-మున్సిపాలిటీ సమావేశంలో సభ్యుల వాదోపవాదనలు

ఘర్షణ పడుతున్న సభ్యులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ : మున్సిపాలిటీ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన సాధారణ సమావేశం వాదోపవాదనులతో ముగిసింది. ఈ సమావేశంలో అభివృద్ధి పనులపై ఎజెండా చదివిన తర్వాత వైసీపీ కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికై జనరల్ ఫండ్స్ తో అభివృద్ధి చేయవద్దని, అత్యవసర సమయంలో జనరల్ ఫండ్స్ చాలా ఉపయోగపడతాయన్నారు. దీంతో కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు వైసీపీ కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నర్సీపట్నం అభివృద్ధి కోసం జనరల్ ఫండ్స్ వినియోగిస్తే తప్పేంట అని మధు ప్రశ్నించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజలకు జనరల్ ఫండ్ నుంచి ఎంత మొత్తమైనా వినియోగించేందుకు సిద్ధమని వాదించారు. గత ఐదేళ్లుగా మున్సిపల్ నిధులను అనవసర మీటింగ్‌లకు, టెంట్ లకు ఉపయోగించి, ఇప్పుడు అభివృద్ధి కోసం ప్రయత్నిస్తుంటే అడ్డుపడుతున్నారని విమర్శించారు. తమ అభివృద్ధిని చూడలేక వైసీపీ కౌన్సిలర్లు ఓర్వలేక పోతున్నారన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో నాలుగు నెలల్లోనే మున్సిపాలిటీకి కోట్లాది రూపాయలు వెచ్చించడం చాలా ఆనందదాయకమని జనసేన పార్టీ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం జోగంపేట జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు అనకాపల్లిలో జరిగిన జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీలో రుత్తల నాగలక్ష్మి, శివగణేష్ త్రోబాల్ పోటీలో నెమపు ఉషశ్రీ ఉమ్మడి విశాఖ జిల్లా నుండి రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సరోజినీ అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే త్రోబాల్, బేస్ బాల్లో ఆటల్లో కూడా సత్తాచాటాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

బికెపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎఒ

ప్రజాశక్తి- కోటవురట్ల: వ్యవసాయ శాఖ అధికారులు నిర్దేశించిన మేరకే ఎరువులు, పురుగుల మందులు పిచికారి చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కే.ఉమా ప్రసాద్ సూచించారు. బుధవారం బి కే పల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ అధికంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకూడదని రైతులకు సూచించారు. ప్రధానంగా పొట్ట దశలో పొటాష్ ఎరువులు తప్పనిసరిగా వాడాలన్నారు. రబీ సీజన్ కు సంబంధించి మినుములు, పెసల విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సరోజిని, వ్యవసాయ సిబ్బంది స్థానిక రైతులు పాల్గొన్నారు.

కె. కోటపాడు: ఉద్యానవన శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను, రాయితీలను అర్హులైన ఉద్యానవన రైతులు సద్వినియోగం చేసుకోవాలని, రైతు సేవా కేంద్రాలలోని గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను సంప్రదించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు సూచించారు. బుధవారం కె. సంతపాలెం, మేడిచెర్ల, అలమండ, కోడూరు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం మాట్లాడుతూ, పంటల బీమా పథకం, మట్టి నమూనా పరీక్షలు, ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా వనరులకేంద్రం వ్యవసాయాధికారిణి తులసి మణి ఎరువుల వాడకం, మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు . మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, సర్పంచ్ అక్కు నాయుడు శంకర్ రావు దొగ్గ దేముళ్ళు సత్యనారాయణ పూడి కృష్ణంనాయుడు రొంగళి కుమార్, విఎఎలు హరీష్, ప్రణయ్ కోడూరు వెటర్నరీ అసిస్టెంట్ సాయి పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో సిహెచ్.నాగాపురం, కుమారపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి సుధారాణి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం రైతులకు పంటల భీమాపై

గొలుగొండ మండలంలో మాట్లాడుతున్న ఎఒ

అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుబ్రహ్మణ్యం, నాయకలు రేగుబల్ల శివ, పోలిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : ఈ ఏడాది రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటలో అంతర పంటగా చోడి పంటను వేసుకుంటే అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక అధికారి చదువుల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని కృష్ణాపురం, సుంకరపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్ది, గంధవరం, అనంతవరం గ్రామ సచివాలయాల్లో చోడి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నవంబర్ మొదటి వారంలో పెసర, మినుము విత్తనాలు మండలానికి వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ శాఖ ఎడిపి విజయ్‌కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవి.చలం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

సచివాలయాల సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి -నక్కపల్లి: నవంబర్ 1 వ తేదీన ఎన్ టి ఆర్ పెన్షన్ పంపిణీ శత శాతం పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో డి.సీతారామరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెన్షన్ పంపిణీ పై ఎంపీడీవో సమీక్షించారు. బ్యాంకు నుండి డ్రా చేసిన నగదు భద్రత, జాగ్రత్తల గురించి తెలియజేశారు. 1వ తేదీన ఉదయం 5 గంటల నుండి అన్ని సచివాలయ పరిధిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పెన్షన్ పంపిణీ చేపట్టాలని సూచించారు.

పేదల పక్షాన నిరంతర పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి -నక్కపల్లి: పేదలకు అండగా నిలిచేది, వారి పక్షాన పోరాడేది సిపిఎం అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె లోకనాథం అన్నారు. మండలంలోని ఎన్.నర్సాపురం గ్రామంలో బుధవారం మనబాల రాజేష్ అధ్యక్షతన సిపిఎం మండల ద్వితీయ మహాసభ జరిగింది. మహాసభ ప్రారంభ సూచికంగా ముందుగా పార్టీ జెండాను సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మరణించిన సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, బి.రాజేష్‌ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలు గురించి పట్టించుకోలేదని, దీంతో పేదలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ ధరలు పెరుగుదలకు నిరసన గా నవంబర్ నెలలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎంతో వెనుకబడి ఉన్న పాయకరావుపేట నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం చేయడానికి సిపిఎం ఈ మహాసభ లో కార్యాచరణ రూపొందించిందని తెలిపారు పేదలకు, దళితులకు, కార్మికులకు, రైతులకు సిపిఎం ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట రానున్న రోజుల్లో ఈ ప్రాంతం పారిశ్రామిక వాడగా మారనుందన్నారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న రసాయన పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ఈ ప్రాంత ప్రజలు సంసిద్ధం కావాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ, కమ్యూనిస్టులు పాలించే ప్రాంతాలన్నీ అభివృద్ధి పథంలో ముందు ఉన్నాయన్నారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తుందన్నారు. విద్యుత్ సంస్కరణల పేరిట విద్యుత్ భారాన్ని ప్రభుత్వం ప్రజలపై వేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు సిపిఎం అండగా నిలిచిందన్నారు.

భూసేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ పరిహారం, చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్,బి.రాము, ఎం.మహేష్ బాబు, జీ.రమణ,ఎస్.ఎర్రయ్య,ఆర్.కనక,ఆర్. దండుబాబు, వి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

సిపిఎం మండల కార్యదర్శిగా రాజేష్

నక్కపల్లి మండల మహాసభలో సిపిఎం మండల కార్యదర్శిగా మనబాల రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా బి.రాము, ఎం.మహేష్ బాబు, కె.కాశీరావు, ఎం.అప్పలరాజు, గొర్ల రమణ, ఆర్ దండుబాబు, ఎర్రయ్య, ఆర్ పెద్ద కనక, దోసూరు కొండ, పల్లా సత్యవతి ని ఎన్నుకున్నారు.

నినాదాలు చేస్తున్న నేతలు, మహిళలు

జనావాసాల నడుమ మద్యం దుకాణం తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం తగదని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు అన్నారు. 34 వార్డు భూపేష్ నగర్ వద్ద మద్యం షాపునకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి 13వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం మంచిదని గొప్పలు చెప్పుకోవడం మాని నిబంధనలు అనుసరించి కూటమి పెద్దలు, అధికారులు మెలగాలన్నారు. భూపేష్ నగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేసే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జోన్ నాయకులు ఎం.ఈశ్వరరావు, సిఐటియు నాయకులు కె.చంద్రశేఖర్, కెవిపి.చంద్రమౌళి, ఎస్.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వారు ఎం.సుబ్బారావు నాయకత్వంలో ఎమ్మెల్యేలు సిహెచ్‌వంశీకృష్ణ శ్రీనివాస్‌కు, వెలగపూడి రామకృష్ణబాబులకు వినతి పత్రాలు సమర్పించారు.

మీడియా తో మాట్లాడుతున్న గణేష్

స్పీకర్ ఆధ్వర్యంలోనే ఇసుక దోపిడీ

-మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఆంధ్రప్రదేశ్ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలోనే ఇసుక దోపిడీ జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విమర్శించారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గబ్బాడ ఇసుక పాయింట్లో ఇసుకదోపిడి జరుగుతుందనే విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. నవంబర్ 25న ఇసుక దోపిడీ జరుగుతున్నట్లు సమాచారం రావడంతో తమ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు అక్కడికి చేరుకోవడంతో అక్కడే ఉన్న అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మెల్లగా జారుకున్నారని విమర్శించారు. ఎటువంటి పర్మిషన్లు లేని లారీలు రాత్రి సమయంలో ఇసుక పాయింట్లో ఉండటం ఏమిటని ప్రశ్నించారు. ఇసుక అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తే తమ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.ఇలాంటి తప్పుడు కేసులు స్పీకర్ అయ్యన్న ప్రోద్భలంతో పెట్టినట్లయితే రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తుందని హెచ్చరించారు. కేసులు పెట్టి వైసిపి పార్టీ నాయకులను బెదిరించాలని చూస్తున్నారని, ఎన్ని కేసులు పెట్టినా తాము అన్యాయాన్ని ఎదుర్కొంటామన్నారు. ప్రజల తరపున పోరాటం చేసేందుకు తాము వెనుకాడమన్నారు. నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశామని త్వరలో ఈ ఇసుక డాన్ ఎవరనేది కనిపెట్టి బయటికి తీసుకొస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, మాకిరెడ్డి బుల్లు దొర తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో నరకాసుర వధ

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో బుధవారం నరకచతుర్దశి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవ మూర్తులను రాజాధి రాజ వాహనంపై అధిష్టింప చేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం నరక చతుర్దశి ఉత్సవంలో భాగంగా నరకాసురుని గడ్డి బొమ్మతోనూ గ్రామ తిరువీధి సేవలో నరకాసుర వధలో భాగంగా దహనం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.

పాల రైతుల సంక్షేమంపై విశాఖ డెయిరీ నిర్లక్ష్యం

స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : విశాఖ డెయిరీ పాల రైతుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తూ స్వలాభం కోసం మాత్రమే పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. బుధవారం నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పాడి రైతుల అభ్యున్నతికి అండగా విశాఖ డైరీని అప్పటి పెద్దలు స్థాపించారన్నారు. ఇప్పుడది పూర్తిగా వాణిజ్యరంగం వైపు మళ్లిపోయి రైతుల సంక్షేమాన్ని పక్కనబెట్టిందని అయ్యన్న పేర్కొన్నారు. డైరీ తమ స్వలాభం కోసం ఆవు పాలు లీటరుకు 3 రూపాయలు తగ్గించినందుకు రైతులు తీవ్రంగా ఆందోళనకు దిగినట్లు చెప్పారు. ఈ నిర్ణయంతో సుమారు మూడు లక్షల మంది రైతులకు అన్యాయం జరుగుతుందని, లక్షల రూపాయలు నష్టపోతారని ఆయన వివరించారు. విశాఖపట్నంలోని విలువైన 7.95 ఎకరాల భూమిని విశాఖ డైరీ ఆక్రమించిందని జనసేన నాయకుడు, విశాఖ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని అయ్యన్న వెల్లడించారు. దీనిపై కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు విశాఖ డైరీ పై విచారణ చేపట్టాలని ఇది వాస్తవం అయితే వారిపై తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.అన్ని పార్టీల నాయకులు కూడా కలిసి రైతుల సమస్యపై పోరాడవలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని కేంద్రం ప్రకటించాలి

నినాదాలు చేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని, ఉద్యోగస్తులను, కాంట్రాక్ట్ వర్కర్స్‌ను తొలగించడం లేదని కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1312వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐద్వా నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, వి.ప్రభావతి, కె.అనురాధ, బి.భారతి, ఆర్.వరలక్ష్మి, డి.కొండమ్మ, కె.కుమారి, గీతాంజలి, సత్య, కామేశ్వరి, ఆర్.భవాని పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి పనులు

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో కంచుగుమ్మల సెంటర్ నుండి అల్లువారి కల్లాల వరకు జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా సుమారు ఒక కిలో మీటరు రోడ్డు నిర్మాణ పునలు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మేరకు గ్రావెల్‌ను ట్రాక్టర్లతో వేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 20లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు ఆ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు .

పనులు చేపడుతున్న రహదారి ఇదే

ప్రారంభిస్తున్న సిఎమ్‌డి

హెచ్‌ఎస్‌ఎల్‌లో గృహాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ తన ఉద్యోగుల సంక్షేమం కోసం పునరుద్ధరించిన గృహాలను బుధవారం సంస్థ సిఎమ్‌డి హేమంత్ ఖత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

వర్షంతో కూలిన పూరిల్లు

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని పాతకృష్ణదేవిపేట ఎస్సీ కాలనీలో గత రాత్రి కురిసిన వర్షానికి జిల్లేడుపూడి సింహాచలంకు చెందిన పూరిల్లు కూలిపోయింది. తనకు ఎటువంటి ఆధారం లేదని అధికారులు స్పందించి ఆదుకోవాలని సింహాచలం కోరుతుంది.

చెక్ అందజేస్తున్న పద్మావతి

సిఎం సహాయనిధి చెక్ అందజేత

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మునిసిపాలిటీ 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి వార్డులో నివసిస్తున్న చిటికల మోహనకృష్ణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 81,800 సిఎం సహాయ నిధి చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ, కుటుంబంలో ఒకరు అనారోగ్యానికి గురైతే, కుటుంబం మంతా కలత చెందుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొరుప్రోలు శ్రీను పాల్గొన్నారు.